సాక్షి సూర్యాపేట

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



ప్రేమ జంట ఆత్మహత్య

తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో పెద్దలను ఎదురించలేక ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. - 8లో



మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్‌దే..

రాష్ట్రంలో మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలోనే ఉంటుందని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. - 8లో

గరిష్టం / కనిష్టం

42° / 27°

వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మట్టపల్లిలో విశేషంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లకు ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం జరిపించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంపటి గురుజీ

చివ్వెంల(సూర్యాపేట): హమాలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురుజీ అన్నారు. ఆదివారం చివ్వెంల మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులో ఉన్న నవోదయ రైస్ మిల్లులో హమాలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ ఇండస్ట్రీని షెడ్యూల్ జాబితాలో చేర్చాలన్నారు. స్థానిక హమాలీలకు పని కల్పించాలని కోరారు. బిహారీ హమాలీల శ్రమ దోపిడీని అరికట్టాలన్నారు. హమాలీల సాధారణ మరణానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి హమాలీలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మేడేను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, నాగు. లింగయ్య, దుర్గయ్య, రవి, వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాలలో మోడల్ ఎంసెట్, నీట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దనియాకుల శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయాలను సాధించడానికి మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బానోతు వినోద్‌కుమార్, అక్కినపల్లి వినయ్, విష్ణు, తన్వీర్, రాకేష్, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో సౌరహోమం



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

మునగాలలో మండుటెండ

అత్యధికంగా 44.6 డిగ్రీలు నమోదు

- అత్యల్పంగా తుంగతుర్తిలో 41.2 డిగ్రీలు
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం

తిరుమలగిరి (తుంగతుర్తి): పెరుగుతున్న ఎండ తీవ్రతతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటుతున్నాయి. ఆదివారం అత్యధికంగా మునగాలలో 44.6 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. అదేవిధంగా పెన్‌పహాడ్‌లో 44.1 డిగ్రీలు, మామిళ్లగూడెంలో 44.1, ముకుందాపురంలో 44 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యల్పంగా తుంగతుర్తిలో 41.2 డిగ్రీలు, జాజిరెడ్డిగూడెంలో 41.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉదయం 9 గంటల తరువాత అవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి వెళ్లొద్దని వైద్యులు సూచిస్తున్నారు. వేడిమిని తట్టుకోవడానికి ప్రజలు ఏసీలు, కూలర్లు, చెట్ల నీడలను ఆశ్రయిస్తున్నారు. ఉక్కపోత, వడగాల్పులు కారణంగా వృద్ధులు, చిన్నారులు తల్లడిల్లుతున్నారు. ఏప్రిల్ చివరి వారంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో మే నెలలో ఎండల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న, వారు చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



తిరుమలగిరిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

జాగ్రత్తలు తీసుకోవాలి



మధ్యాహ్నం సమయంలో బయట తిరగొద్దు. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. రోడ్ల వెంట అమ్మే ఐస్‌క్రీమ్‌లు తీసుకోవద్దు. రోజూ 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలి. టూ వీలర్‌పై ప్రయాణించే వారు ముఖానికి రుమాలు చుట్టుకోవడం ఉత్తమం. తేలికైన తెల్లని కాటన్ దుస్తులు ధరించాలి.

– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి

ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా.. (డిగ్రీల సెల్సియస్‌లలో)

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రత
మునగాల	మునగాల	44.6
పెన్‌పహాడ్	పెన్‌పహాడ్	44.1
మోతె	మామిళ్లగూడెం	44.1
మద్దిరాల	ముకుందాపురం	44.0
నూతనకల్	నూతనకల్	43.9
మఠంపల్లి	మఠంపల్లి	43.9
మోతె	ఉర్లుగుండ	43.8
కోదాడ	తొగర్రాయి	43.7
మఠంపల్లి	పెద్దవీడు	43.6
పాలకవీడు	అలంగాపురం	43.5
ఆత్మకూర్	ఆత్మకూర్	43.5
మేళ్లచెరువు	మేళ్లచెరువు	43.4
అనంతగిరి	గోండ్రియాల	43.4
అనంతగిరి	శాంతినగర్	43.4
నాగారం	నాగారం	43.4
చిలుకూరు	చిలుకూరు	43.4
నడిగూడెం	నడిగూడెం	43.4
చింతలపాలెం	దొండపాడు	43.2
సూర్యాపేట	ఎర్కారం	43.1



రంగంలోకి వారియర్స్

- సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్‌స్టేషన్లలో సహాయ కేంద్రాలు
- ప్రతి స్టేషన్‌కు ఒక అధికారి నియామకం
- జనవరి నుంచి ఇప్పటి వరకు 425 సైబర్ కేసులు నమోదు

తిరుమలగిరి (తుంగతుర్తి): నేడు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండగా.. అదే తరహాలో సైబర్ నేరాలు విజృంభిస్తున్నాయి. స్మార్ట్ ఫోన్ల వినియోగం కూడా పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను పలు రకాల ఆఫర్లతో ప్రలోభాలకు గురి చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో సైబర్ నేరాలను నియంత్రించేందుకు సహాయ కేంద్రాలను నెలకొల్పి బాధితులకు వెంటనే న్యాయం జరిగేలా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక సైబర్ వారియర్‌ను నియమించారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉన్న సిబ్బంది ఎంపిక

పోలీస్ శాఖలో నియమితులై సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉన్న సిబ్బందిని సైబర్ వారియర్స్‌గా ఎంపిక చేశారు. వీరికి సైబర్ నేరాలు ఎన్ని రకాలుగా జరుగుతున్నాయి. ఫిర్యాదు అందిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలు ఏంటి?, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సెక్యూరిటీ పాలసీ చట్టం, కమ్యూనికేషన్ వ్యవస్థ, ఇంటర్నెట్, డాటా సెంటర్, నెట్‌వర్కింగ్ వ్యవస్థ, నేషనల్ నెట్‌వర్కింగ్, మొబైల్ అప్లికేషన్స్, సెక్యూరిటీ రిస్క్, సోషల్ ఇండియా ఇన్ గవర్నర్ సంఘటన సమాచార విధానం తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. నేర బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు సైబర్ వారియర్లకు మొబైల్‌తో పాటు సిమ్‌కార్డు అందజేశారు. సైబర్ రేసుల్లో పూర్తి స్థాయి ఆధారాలను సేకరించి నేరస్తులను గుర్తించడం, బాధితులకు న్యాయం చేసి నేరస్తులకు శిక్ష పడేలా చేయడం వీరి విధి. వీరు సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఎక్కడికక్కడే పోలీస్ స్టేషన్ల వారీగా చర్యలు తీసుకుంటారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరానికి గురైన గంటలోపు ఫిర్యాదు చేస్తే రికవరీకి ఎక్కువగా అవకాశాలు ఉంటాయని పోలీసులు సూచిస్తున్నారు. కాగా.. జిల్లాలో సైబర్ నేరాలకు సంబంధించి జనవరి నుంచి ఇప్పటి వరకు 425 ఫిర్యాదులు అందాయి.



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో వ్యక్తిగత వివరాలు నమోదు చేయొద్దు. ఫోన్‌లకు అపరిచితులు పంపిన లింక్‌లను ఓపెన్ చేయొద్దు. ఫోన్ నుంచి ఆర్థిక లావాదేవీలు జరిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి.

– రాహుల్ హెగ్డే, ఎస్పీ

పోలీస్‌స్టేషన్ల వారీగా సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అర్వపల్లి	87126 58089
హుజూర్‌నగర్	87126 58090
మేళ్లచెరువు	87126 58091
మోతె	87126 58092
మునగాల	87126 58093
మఠంపల్లి	87126 58094
నడిగూడెం	87126 58095
నేరేడుచర్ల	87126 58096
పెన్‌పహాడ్	87126 58097
తుంగతుర్తి	87126 58098
చిలుకూరు	87126 58099
నూతనకల్	87126 58180
తిరుమలగిరి	87126 58181
సూర్యాపేట టూ టౌన్	87126 58182
నాగారం	87126 58183
మద్దిరాల	87126 58184
పాలకీడు	87126 58185
అనంతగిరి	87126 58186
కోదాడ టౌన్	87126 58187
సూర్యాపేట టౌన్	87126 58188
గరిడేపల్లి	87126 58189
చివ్వెంల	87126 58190
ఆత్మకూరు(ఎస్)	87126 58191
కోదాడ రూరల్	87126 58192
సూర్యాపేట రూరల్	87126 58193
చింతలపాలెం	87126 58194

బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

నడిగూడెం: బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం నడిగూడెం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆయనతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాలుగు నెలలకే ప్రజలకు విరక్తి పుట్టిందని ఆరోపించారు. ముఖ్యంగా రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందని తెలిపారు. కాలంతో కాదని, కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో కరువు వచ్చిందన్నారు. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు సాగర్ కాల్వకు నీరివ్వకుండా మూడున్నర లక్షల ఎకరాల్లో పంట నష్టానికి కారణమయ్యారని విమర్శించారు. అనంతరం కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుబంధంగా చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఎంపీపీ యాతాకుల జ్యోతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి పాల్గొన్నారు.

మఠంపల్లిలో హోరాహోరీగా ఎడ్ల పందేలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని శుభవార్త చర్చి తిరనాళ్లను పురస్కరించుకుని శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వీవీహైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు ఆదివారం మూడోరోజు కొనసాగాయి. కేటగిరి గిత్తల విభాగంలో నిర్వహించిన పోటీల్లో ప్రకాశం జిల్లా, కృష్ణా, పల్నాడు, గుంటూరు, సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన సుమారు 12జతల గిత్తలు పోటీలో తలపడ్డాయి. అర్ధరాత్రి వరకు పోటీలను ఫ్లడ్ లైట్ల వెలుతురులో నిర్వహించి విజేతలైన ఏడు జతల గిత్తలకు వరుసగా రూ.2లక్షల 20వేలను పంపిణీ చేయనున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. కృష్ణా జిల్లా పెనుమత్సకు చెందిన రాధాకృష్ణ అంపైర్, వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతి కిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లూర్దుమారెడ్డి, బాలరెడ్డి, గాలి చిన్నపురెడ్డి, బోయపాటి ఆంతోనిరెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, గోపు ఆనందరెడ్డి, విక్టర్‌రెడ్డి, లూర్దురెడ్డి, ఆదూరి శౌరెడ్డి, జార్జిరెడ్డి, బాలరెడ్డి, శుభోదయ సభ్యులు కొమ్మారెడ్డి రంజిత్‌రెడ్డి, గోపు అఖిల్‌రెడ్డి, గాదె మనీస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బండ లాగుతున్న ఒంగోలు జాతి గిత్తలు

వయోజన విద్యకు 'ఉల్లాస్'

- న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం అమలుకు ప్రత్యేక యాప్ రూపకల్పన
- ప్రతి పాఠశాల నుంచి హెచ్ఎం, ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని నిర్ణయం
- ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం శిక్షణ తరగతులు ప్రారంభం



కేంద్రం రూపొందించిన ఉల్లాస్ యాప్

హుజూర్‌నగర్: పదిహేనేళ్లు దాటిన ప్రతి వయోజనుడిని అక్షరాస్యుడిని చేయడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం నవ భారత సాక్షరత (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఇందుకోసం ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఈ సొసైటీ) పేరిట యాప్‌ను రూపొందించింది. గూగుల్ ప్లేస్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసుకునే విధంగా అందుబాటులోకి తెచ్చింది. లబ్ధిదారులు ఇందులో వారి ఉనికి, గుర్తింపు తదితర వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. దీనిని అమలు చేసేందుకు జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉన్నత పాఠశాల హెచ్ఎం లిటరసీ సూపర్‌వైజర్‌గా, మరో ఉపాధ్యాయుడిని లిటరసీ టీచర్‌గా, మరో యాక్టివ్ ఉపాధ్యాయుడిని లిటరసీ సర్వేయర్‌గా ఎంపిక చేయనున్నారు. పొదుపు సంఘాల మహిళలు, పాఠశాల విద్యార్థులను గుర్తించి వారిని కూడా ఇందులో భాగస్వాములుగా చేస్తారు.

సెల్‌ఫోన్ ద్వారా పాఠాలు

వయోజన నిరక్ష్యరాస్యులకు సెల్‌ఫోన్ ద్వారా పాఠాలు నేర్పుతారు. న్యూమరసీ, లిటరసీ గురించి ప్రధానంగా గణితంలో చతుర్విధ ప్రక్రియలు సహా జీవన సాఫల్యత, మనో వైజ్ఞానిక పాఠాలు నేర్పుతారు. ఆ తరువాత వారి సామర్థ్యాలను తెలుసుకోవడానికి పరీక్ష నిర్వహించి మార్కులను ఆయా వయోజనులకు వివరిస్తారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే తొలుత ప్రతి పాఠశాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించి ఆవాస పద్ధతిలో అధిక జనాభా ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ బోధకులను, నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి వారికి శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తారు.

జిల్లాల్లో 1,29,883 మంది నిరక్షరాస్యులు

జిల్లాలో ఉన్న నిరక్షరాస్యుల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతానికి చెందిన వారే ఉన్నారు. అధికారులు లెక్కల ప్రకారం జిల్లాల్లో మొత్తం 1,29,883 మంది నిరక్షరాస్యులు ఉండగా వారిలో పురుషులు 43,952 మంది, స్త్రీలు 85,931 మంది ఉన్నారు. వీరిలో ఈ ఏడాది పురుషులు 11,067 మంది, స్త్రీలు 16,601 మొత్తం కలిపి 27,668 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఎన్నికల కోడ్‌తో ఆలస్యం

నవభారత్ సాక్షరత కార్యక్రమానికి సంబంధించి ఉల్లాస్ యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఎన్నికల కోడ్‌తో ఈ కార్యక్రమం అమలులో కొంత ఆలస్యం జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నవభారత్ సాక్షరత పథకం అమలు చేస్తాం.

– నర్సింహారెడ్డి, వయోజన విద్య ఏపీఓ, ఉమ్మడి నల్లగొండ జిల్లా

మొక్కవోని దీక్షతో..



అడివెంల వన నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు

- తొమ్మిదో విడత హరితహారానికి సిద్ధమవుతున్న యంత్రాంగం
- 52 లక్షల మొక్కలే లక్ష్యంగా నర్సరీల్లో పెంపకం
- ఎండలకు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు

అర్వపల్లి: హరితహారం తొమ్మిదో విడత కార్యక్రమానికి అధికార యంత్రాంగం మొక్కవోని దీక్షతో సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 2024–25 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 52 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. వర్షాలు పడగానే నాటేందుకు పల్లె నర్సరీలలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల సంరక్షణపై దృష్టి సారించింది. ప్రస్తుత వేసవిలో మండుతున్న ఎండలకు నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరందిస్తూ అవి ఎండిపోకుండా కంటికి రెప్పలా కాపాడుతున్నారు.

ఒక్కో నర్సరీలో 10వేల మొక్కలు..

జిల్లాలోని 475 గ్రామ పంచాయతీలు, 5 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా చోట్లలో నాటేందుకు గాను గ్రామ పంచాయతీల వారీగా నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టారు. ఈ విడతలో డీఆర్‌డీఓ, అటవీశాఖ, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు పెంచుతున్నారు. ఈసారి నిర్దేశించుకున్న 52 లక్షల మొక్కల లక్ష్యం మేరకు ఒక్కో నర్సరీలో 10వేల నుంచి ఆపైన పెంచుతున్నారు.

పెంచుతున్న మొక్కలు ఇవే..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కల్లో ముఖ్యంగా కానుగ, గుల్మోరా, రావి, మర్రి, టేకు, గన్నేరు మొక్కలు ఉన్నాయి. వీటితోపాటు పండ్లు, నీడనిచ్చే మొక్కలను సైతం పెంచుతున్నారు. నర్సరీల నిర్వహణ బాధ్యతలను ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. అయితే గతంలో నాటిన వాటిలో ఎక్కడైనా ఎండిపోతే తిరిగి నాటేందుకు మండల స్థాయిలో మండల పరిషత్, ఉపాధిహామీ అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా నర్సరీల్లో ఎండలకు మొక్కలు ఎండిపోకుండా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నీడ పందిర్లను (షేడ్‌నెట్లు) ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు.

మొక్కల కోసం నీడ పందిర్లు ఏర్పాటు



నర్సరీల్లో మొక్కలను సంరక్షించే బాధ్యతను గ్రామ పంచాయతీలే చూస్తున్నాయి. ఎండలు ఎక్కువగా ఉండడంతో మొక్కలు వాడిపోకుండా నీడపందిర్లు ఏర్పాటు వేయించాం. జూన్ మొదటి వారంలో వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తాం.

– మధుసూదన్‌రాజు, డీఆర్‌డీఓ

యాదాద్రి శ్రీలక్ష్మీనారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం ఈ శ్రీస్వామి, అమ్మవారికి ఆరాధన, నిజాభిషేకం, అర్చన చేశారు. ఇక ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తరం, ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన, నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

తనిఖీల్లో రూ.11 కోట్ల నగదు, మద్యం స్వాధీనం

● నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వాహనాల తనిఖీల్లో ఇప్పటివరకు రూ.11,07,41,000 నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు వెంట నిఘా పెంచామని, వాడపల్లి, అడవిదేవులపల్లి, నాగార్జున సాగర్‌లోని చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎన్‌హెచ్-65పై కేతేపల్లి టోల్‌ప్లాజా, చిట్యాల పోలీస్ స్టేషన్‌తో పాటు వట్టిమర్తి గ్రామ స్టేజీ వద్ద, మాల్, డిండి పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతిఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనేలా చూడాలి



హుజూర్‌నగర్‌లో అధికారులకు సూచనలిస్తున్న మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

హుజూర్‌నగర్: ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. ఆదివారం ఆయన హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని నేరేడుచర్ల, గరిడేపల్లి, చింతలపాలెం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను, మట్టపల్లి వద్ద అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు, హుజూర్‌నగర్‌లోని స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల కోసం మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాస్, ఆయా మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

వారసత్వ రాజకీయాలు దేశానికే ప్రమాదం

● బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

నల్లగొండ రూరల్: వారసత్వ రాజకీయాలతో దేశానికే ప్రమాదం పొంచి ఉందని, రాహుల్ గాంధీ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి వరకు వారసత్వ రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీజేపీ గెలిచే 400 ఎంపీ స్థానాల్లో నల్లగొండకు స్థానం ఉంటుందని అన్నారు. ప్రధాని మోదీకి దేశమే కుటుంబంగా ఉందన్నారు. రాహుల్‌గాంధీ పేరు చెబితే ఓట్లు పడే పరిస్థితి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రతి ఇంటికి గ్యాస్, ప్రతి గ్రామానికి రోడ్డు, వ్యవసాయ రంగానికి కేంద్రం చేయూతనిచ్చిందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటేస్తే మురిగిపోతుందని, బీజేపీకి ఓటేస్తే దేశం వెలిగిపోతుందన్నారు. ప్రపంచ దేశాలన్నీ మోదీ పాలనను ప్రశంసిస్తున్నాయన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఇక్కడ పరిశ్రమలు స్థాపించాలని కేంద్ర మంత్రితో మాట్లాడినట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత తీసుకుంటామన్నారు. సాగర్‌లో నీరున్నా చెరువులు నింపలేదన్నారు. చెరువుల్లో మట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, శ్రీదేవిరెడ్డి, పిల్లిరామరాజు, పోతేపాక సాంబయ్య, లింగస్వామి, మునికుమార్, మహేష్, భూపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బోగరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి చామల, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్: రాష్ట్రంలో మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలోనే ఉంటుందని కాంగ్రెస్ పార్టీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీబీనగర్‌లో నిర్వహించిన రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని బొంద పెట్టామని అన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పాపాల చిట్టా బయటకు వస్తున్నాయని, కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి జిల్లాకు నిధులు తేవడం చేతకాలేదని, కానీ కేసీఆర్‌కు మందు పోయడం తెలుసని ఎద్దేవా చేశారు. ఆగస్టు లోపు రుణమాఫీ చేస్తామని అన్నారు. ఆగమైన తెలంగాణ రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

నిధుల కోసం పోరాటం చేస్తా..

తనను ఎంపీగా గెలిపిస్తే భువనగిరి ప్రాంత అభివృద్ధికి కావాల్సిన నిధుల కోసం పార్లమెంట్‌లో పోరాటం చేస్తానని ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటేనన్నారు. ప్రజలు గమనించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, గోలి పింగళ్‌రెడ్డి, పొట్టోళ్ల శ్యాంగౌడ్, వేణుగౌడ్, మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అచ్చయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలు ఎప్పటికప్పుడు పంపాలి

● ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్



రామాపురం క్రాస్‌రోడ్‌లో ఆర్డీఓతో మాట్లాడుతున్న కళ్యాణ్‌కుమార్ దాస్

కోదాడరూరల్: ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఖర్చు పెడుతున్న వివరాల నివేదికను స్థానిక ఎన్నికల అధికారుల ఎప్పటికప్పుడు తయారుచేసి పంపించాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్ అన్నారు. ఆదివారం కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. అభ్యర్థుల ప్రచార వ్యయాలు ఎన్నికల నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా నగదు, మద్యం, విలువైన వస్తువులు, మాదక ద్రవ్యాలు రాకుండా వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఇప్పటి వరకు పట్టుబడిన నగదు, ఇతర వస్తువుల వివరాలను ఆర్డీఓ సీహెచ్. సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.

రాజగోపాల్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలి

● బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

చౌటుప్పల్: ఎంపీగా, ఎమ్మెల్సీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ సవాల్ విసిరారు. ఈ విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకొండూర్ రోడ్డులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. తాను ఎంపీగా ఉన్నప్పుడు రూ.9వేల కోట్లతో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి ఏమిటో చూపిస్తానని, దమ్ముంటే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని డిమాండ్ చేశారు. 2009లో రాజగోపాల్‌రెడ్డి ఆస్తులు రూ.19కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.450కోట్లకు పెరిగాయన్నారు. తాను రూ.254 కోట్ల ఆస్తులు ప్రజల కోసం అమ్ముకున్నానని తెలిపారు. తనకు మంత్రి పదవి కావాలన్న కోరికతో కంపు రాజకీయాలకు రాజగోపాల్‌రెడ్డి తెరలేపారన్నారు. బూర నర్సయ్యగౌడ్ దెబ్బకు రాజగోపాల్‌రెడ్డి రాత్రిపూట ఇతర పార్టీల కార్యకర్తల ఇళ్లలోకి వెళ్లి వారి కాళ్లు మొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. దేశం బాగుండాలంటే మరోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అవ్వాల్సిందేనని గుర్తుచేశారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎవరో ఎవరికీ తెలియదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసినా దండగేనన్నారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, బీజేపీ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శాగ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలె చిరంజీవి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, కాయితి రమేష్‌గౌడ్, పాలకూర్ల జంగయ్య, ఊడుగు యాదయ్య, బాతరాజు సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గళమెత్తుతా

● సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్



రామన్నపేటలో వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న ఎండీ జహంగీర్

రామన్నపేట: భువనగిరి ఎంపీగా తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై గళమెత్తుతానని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ కోరారు. ఆదివారం రామన్నపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. చట్టసభల్లో సగానికిపైగా కోటీశ్వరులు, నేరస్తులు ఉన్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు రాజకీయాల్లోకి ప్రవేశించి ఎన్నికలను డబ్బు మయం చేశారని ఆరోపించారు. ఇతర ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రజా సమస్యలపై కనీస అవగాహన లేదని, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎల్లలు కూడా తెలియవని ఎద్దేవా చేశారు. గతంలో ఎంపీగా రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్, ఒకసారి గెలిచిన బీఆర్‌ఎస్ పార్టీలు నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యమని ఆరోపించారు. కార్యక్రమంలో మేక అశోక్‌రెడ్డి, కల్లూరి మల్లేశం, బొడ్డుపల్లి వెంకటేశం, నాగటి ఉపేందర్, బడుగు రమేష్, వనం ఉపేందర్, ఆవనగంటి వెంకటేశం, కూరెళ్ల నర్సింహాచారి, ఎర్రోళ్ల లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.16లక్షలు పట్టివేత

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో నందిపహాడ్ ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం టూటౌన్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా దామరచర్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి 140 గ్యాస్ స్టవ్‌లతో పాటు రూ.1.16 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్న డబ్బులను జిల్లా ట్రెజరరీ ఆఫీసుకు తరలించినట్లు టూటౌన్ సీఐ పి. నాగార్జున తెలిపారు.

పదేళ్లుగా నిరుద్యోగ సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్

నల్లగొండ రూరల్ : పదేళ్లుగా నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తూ జైలు జీవితం గడిపానని నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20ఏళ్లుగా జర్నలిస్టుగా, చరిత్రకారుడిగా, ఉద్యమకారుడిగా అశోక అకాడమి పేరుతో నిరుద్యోగులకు ఆన్‌లైన్ పోటీ పరీక్షల సిలబస్ చెప్పి ఉద్యోగాల్లో రాణించేలా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక కేసులు పెట్టి చంచల్‌గూడ జైలుకు తరలించి ఇబ్బందులకు గురి చేసినా నిరుద్యోగుల గొంతుకగా నిలబడి పోరాటం చేసానన్నారు. గ్రూప్1, 2 పోటీ పరీక్షల విషయంలో, కానిస్టేబుల్ రిజర్వేషన్ల విషయంపై నిరుద్యోగుల తరపున పోరాటం చేసినట్లు తెలిపారు. నిరుద్యోగులంతా తనకు ఓటేసి గెలిపించాలని నిరుద్యోగ, ఉద్యోగ సమస్యలపై పోరాడతానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నోటిఫికేషన్లు ఇవ్వలేదన్నారు. సమావేశంలో నరేష్, సురేష్, శ్రీనివాస్, శోభ, మంజుల, రాధిక, హైమావతి, రాణి, ముత్యం, మహేష్, విఘ్నేష్ పాల్గొన్నారు.

పెద్దలను ఎదిరించలేక ప్రేమ జంట ఆత్మహత్య

● సూసైడ్ నోట్ లభ్యం
● ఏడుగురిపై కేసు నమోదు
● తుమ్మల పెన్‌పహాడ్‌లో ఘటన



సంజయ్ (ఫైల్)



నాగజ్యోతి (ఫైల్)

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట): పెద్దలను ఎదిరించలేక ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన గుండగాని సంజయ్, అదే గ్రామానికి చెందిన సల్లగుండ్ల నాగజ్యోతి ఆరేళ్లగా ప్రేమించుకుంటున్నారు. సంజయ్ సూర్యాపేటలో ఉంటూ వాటర్ ప్లాంట్‌లో మెకానిక్‌గా పనిచేస్తుండగా.. నాగజ్యోతి బీ-ఫార్మసీ పూర్తిచేసి హైదరాబాద్‌లోని నాగోల్ క్రాస్ రోడ్‌లో గల ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో పనిచేసుకుంటూ ఎం-ఫార్మసీ చదువుతోంది. తాను నాగజ్యోతిని ప్రేమిస్తున్న విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు గతంలోనే సంజయ్ తెలియజేయగా వారు వివాహానికి ఒప్పుకోలేదు. అయినప్పటికీ మూడేళ్లుగా వారు ప్రేమలోనే ఉన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు నాగజ్యోతి తల్లిదండ్రులకు లేనిపోని విషయాలు చెప్పడంతో ఆమెను తండ్రి మందలించాడు. ఉగాది పండుగ తర్వాత నుంచి ఆమెను ఉద్యోగం మాన్పించి ఇంటి దగ్గరే ఉంచాడు.

కలిసి ఉండలేమని భావించి..

తమ ప్రేమ విషయమై గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అసత్యాలు ప్రచారం చేస్తుండడంతో, ఇకపై తాము కలిసి ఉండలేమని భావించి వారిద్దరు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి సంజయ్, నాగజ్యోతి తమ తమ ఇళ్ల నుంచి బయటికి వచ్చి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగారు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లేవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించగా.. అంత్యక్రియలు పూర్తిచేశారు.

సూసైడ్ నోట్ లభ్యం..

తమ ప్రేమకు అడ్డంకిగా మారి ఇబ్బందులకు గురిచేసిన గ్రామానికి చెందిన బెల్లంకొండ నారాయణ, ఆరె లతారెడ్డితో పాటు నాగజ్యోతి బంధువులైన సల్లగుండ్ల అజయ్, సల్లగుండ్ల మల్లయ్య, సల్లగుండ్ల శ్రీను, సల్లగుండ్ల ఉప్పలయ్యతో పాటు నాగజ్యోతి తండ్రి సల్లగుండ్ల శ్రీనుపై చర్యలు తీసుకోవాలని వారు సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

● అడ్డుకున్న పోలీసులు



వెంకటమ్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా అడ్డుకుంటున్న పోలీసులు

మునగాల(కోదాడ): తమకు న్యాయం జరగడం లేదని ఓ మహిళ మునగాల పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు.. తమ పొలంలో బావి తవ్వించుకునేందుకు గాను ఇంట్లో దాచిన నగదును తమ కోడలు సంధ్య, ఆమె సోదరుడు రాచర్ల రాజేష్ దొంగిలించారని మునగాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన దామెర కృష్ణయ్య, వెంకటమ్మ దంపతులు గత జనవరిలో మునగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు కేసు నమోదు చేయకుండా తమ ఫిర్యాదును బుట్టదాఖలు చేయడమే కాకుండా తిరిగి తమపైనే అక్రమ కేసు పెట్టారని వెంకటమ్మ ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ, డీఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడమే కాకుండా మునగాల పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో తమకు న్యాయం చేయాలంటూ ఆదివారం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆదివారం వెంకటమ్మ పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. కృష్ణయ్య, వెంకటమ్మ దంపతులు ఇచ్చిన ఫిర్యాదు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలి

నల్లగొండ టూటౌన్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోదాడ బీఆర్‌ఎస్ నేత, ఎన్నారై జలగం సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను కోరినట్లు తెలిపారు. జలగం ఇంటి పేరు, ఎన్నారైగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టినందున ప్రజల్లో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఇప్పటికే మూడు జిల్లాల్లోని మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులతో మాట్లాడి మద్దతు కోరినట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

అడవిదేవులపల్లి: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి శివారులో జరిగింది. ఎస్‌ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన గువ్వల పెదసైదయ్య(55) బైక్‌పై చిట్యాల గ్రామంలో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా.. బాల్నేపల్లి గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. పక్కనే ఉన్న బండరాయి తగలడంతో తలకు బలమైన గాయాలతో పాటు కాలు విరిగింది. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బాలసైదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారులున్నారు.

ఆబోతుకు అంత్యక్రియలు



ఆబోతును ఊరేగింపుగా అంత్యక్రియలకు తీసుకెళ్తున్న పెద్దదేవులపల్లి గ్రామస్తులు

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో ఎండ వేడిమికి తట్టుకోలేక ఆదివారం ఆబోతు మృతిచెందింది. గ్రామానికి చెందిన వనం శ్రీను జ్ఞాపకార్థం ఆయన తండ్రి వనం కోటయ్య 24 ఏళ్ల కిందట ఆబోతును గ్రామంలో వదిలారు. గ్రామస్తులు ఆబోతును దైవంతో సమానంగా భావించి పూజలు చేసేవారు. ఆబోతు మృతిచెందడంతో గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలి

● ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



మాజీ మంత్రి ఆర్డీఆర్‌ను కలిసిన తీన్మార్ మల్లన్న

భానుపురి (సూర్యాపేట): పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థిగా తనను గెలిపించాలని ఖమ్మం, వరంగల్, నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) కోరారు. ఆదివారం సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మద్దతు కోరుతూ ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే నెల 27న జరిగే ఎన్నికల్లో సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచి ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆశీస్సులతో మే 3న నల్లగొండలో నామినేషన్ వేయబోతున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసిన పార్టీ బీఆర్‌ఎస్ అని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులు దొరికే పరిస్థితి లేదన్నారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వీరేశం, నేతిని కలిసిన తీన్మార్ మల్లన్న

నకిరేకల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఆదివారం పట్టణంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన తనకు మద్దతు తెలపాలని కోరారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. మహిళ మృతి



వెంకటమ్మ (ఫైల్)

గరిడేపల్లి: బైక్‌ను కారు ఢీకొట్టడంతో మహిళ మృతి చెందింది. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలంలోని కుతుబ్‌షాపురం గ్రామానికి చెందిన గడ్డం వెంకటమ్మ(49), ఆమె తమ్ముడు భద్రయ్య కలిసి బైక్‌పై నేరేడుచర్ల మండలం చింతకుంట్ల గ్రామంలో బంధువుల వివాహానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్ పోసుకొని బయటకు వస్తుండగా.. కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ, భద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో వెంకటమ్మ మృతిచెందింది. భద్రయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతురాలి భర్త గడ్డం అచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పిచ్చికుక్క దాడి.. ఐదుగురికి గాయాలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం పిచ్చికుక్క దాడి చేయడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇళ్ల ముందు కూర్చున్న మంద రమణ, చెడిపల్లి జీవనమ్మ, పొట్టిపాక నర్సయ్య, పొట్టిపాక సోమమ్మ, దోరెపల్లి ఉప్పలమ్మను పిచ్చికుక్క కరవడంతో వారు గాయపడ్డారు. మరికొంత మంది కుక్క దాడి నుంచి తప్పించుకున్నారు. గాయపడిన వారిని వెంటనే గ్రామ ఆశ కార్యకర్త పొట్టిపాక శైలజ అర్వపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల సమస్య తీవ్రమైందని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు



ప్రమాదానికి గురైన ఆటో

కొండమల్లేపల్లి: ఆటోను కారు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాలు.. ఏపీలోని మాచర్లలో జరుగుతున్న జాతరలో చిన్న చిన్న వస్తువులు అమ్ముకునేందుకు గాను దేవరకొండ నుంచి నలుగురు వ్యక్తులు ఆటోలో వెళ్తున్నారు. మార్గమధ్యలో కొండమల్లేపల్లి దాటగానే చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

యువత క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేసిన మీలా మహదేవ్ తదితరులు

సూర్యాపేటటౌన్: యువత క్రీడల్లోనూ రాణించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం అండర్ 14, 16, 18, 20 సంవత్సరాల బాలబాలికలు, మహిళా, పురుషుల విభాగాల్లో రన్నింగ్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల నుంచి 750మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. 100మీటర్లు, 400మీటర్లు, 800, 600మీటర్లు, 5కేఎం, 3కేఎం రన్నింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు మెడల్స్, షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ గడ్డం వెంకటేశ్వర్లు, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆజంబాబా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోట దగ్ధం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని ఆయిల్ పామ్ తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన డాక్టర్ మారుపాక జనార్దన్ ఏడాది కాలంగా ఆయిల పామ్ తోట సాగు చేస్తున్నాడు. ఈ తోటలో 80 ఆయిల్ పామ్ మొక్కలను పెంచుతున్నారు. ఆదివారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని తోటలోని చెట్లు, డ్రిప్ పైపులు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.